నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శుక్రవారం 15 మార్చి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యేలు


కేసీఆర్‌తో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జాదవ్ అనిల్

ఆసిఫాబాద్ టౌన్/రెబ్బెన,మార్చి14 : హైదరాబాద్‌లో బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును ఆసిఫాబాద్, బోథ్ ఎమ్మెల్యేలు కోవలక్ష్మి, అనిల్‌జాదవ్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, జడ్పీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు అరిగెల నాగేశ్వరరావు గురువారం కలిశారు. స్వయంగా ఆయన నివాసానికి వెళ్లి మాట్లాడారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం కలిసికట్టుగా పనిచేయాలని కేసీఆర్ వారికి సూచించారు. ఆసిఫాబాద్ ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, బీఆర్ఎస్ నాయకులు గంధం శ్రీనివాస్, అబ్దుల్లా, సుంకరి పెంటయ్య, రెబ్బెన ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలి


నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్ టౌన్,మార్చి 14 : జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిపారుదల, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఈ నెల 15న ప్రారంభించనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయ భవనాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీతో కలిసి పరిశీలించారు. ఇంకా ఏవైనా పనులు మిగిలి ఉంటే వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ పీడీ సురేందర్, ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, ఇంజినీరింగ్, గ్రంథాలయ అధికారులు ఉన్నారు.

# ఎనిమిదేండ్లుగా ఎదురుచూపులే..!

**కాగజ్‌నగర్-సిర్పూర్ రహదారిలో పూర్తికాని వేంపల్లి ఆర్వోబీ**

- రూ.30 కోట్లతో పనులన్నీ పూర్తి చేసిన కేసీఆర్ సర్కారు
- 40 మీటర్ల బ్రిడ్జి వేయడంలో రైల్వే శాఖ నిర్లక్ష్యం
- గేటు వేసినప్పుడుల్లా కిలో మీటర్ దాకా ట్రాఫిక్ జామ్
- తీవ్ర ఇబ్బందుల్లో ప్రయాణికులు


రైల్వే గేటు పడడంతో కిలో మీటర్ల మేర నిలిచిన వాహనాలు(ఫైల్)

మంచిర్యాల, మార్చి 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాగజ్‌నగర్-సిర్పూర్ ప్రధాన రహదారి మధ్యలో వేంపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణం ఎనిమిదేండ్లుగా కొనసాగుతూనే ఉంది. 2016లో కేసీఆర్ సర్కారు ఈ పనులు ప్రారంభించగా, నిమ్మలంగా మేల్కొన్న అటవీశాఖ అనుమతులు లేవంటూ కొన్నేండ్లు పాటు పనులకు అడ్డుతగిలింది. అటవీశాఖ కొర్రీలు.. క్లియరెన్సులు.. కోర్టు కేసులు... నిధుల కొరత.. ఇలా అన్నింటిని దాటుకుంటూ గత ప్రభుత్వం పనులను పూర్తి చేసింది. సుమారు రూ.30 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సిన పనులన్నీ పూర్తయి ఏడాది కావస్తున్నా రైల్వే శాఖ నిర్లక్ష్యం ఇప్పుడు ఆర్వోబీకి శాపంగా మారింది. ట్రాక్ మీదుగా బ్రిడ్జి వేయాల్సిన బాధ్యత రైల్వే శాఖపై ఉన్నప్పటికీ పట్టించుకునే నాథుడు కరవయ్యాడు. రైల్వేలో నిత్యం అధికారులు మారుతుండడం, ఫోన్ నంబర్లు ఛేంజ్ అవుతుండడంతో.. పనులు ముందుకు సాగడం లేదని ఆర్అండ్‌బీ అధికారులు చెబుతున్నారు. ఈ ఆర్వోబీ పూర్తయితే కౌటాల, బెజ్జూర్, చింతలమానేపల్లి, సిర్పూర్ మండలాలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది. మహారాష్ట్ర నుంచి వచ్చే వారికి మార్గం సుగమం అవుతుంది. కానీ రైల్వే అధికారుల పట్టింపులేని తనంతో పొరుగున ఉన్న మహారాష్ట్ర ప్రజలతో పాటు కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ప్రజలు నరకయాతన అనుభవించాల్సి వస్తుంది.

### ప్రతి రోజూ ఉదయం హెవీ ట్రాఫిక్..

ఢిల్లీ నుంచి సికింద్రాబాద్, చెన్నై, కేరళ వెళ్లాల్సిన రైళ్లన్నీ సిర్పూర్ కాగజ్‌నగర్ మీదుగానే వెళ్తుంటాయి. ప్రతి రోజూ దాదాపు 20కిపైగా ప్యాసింజర్, సూపర్‌ఫాస్ట్, ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లతో పాటు గూడ్స్ రైళ్లు ఈ మార్గం మీదుగానే పోతుంటాయి. ఉదయం వేళ సికింద్రాబాద్ సూపర్‌ఫాస్ట్, భాగ్యనగర్, ఇంటర్‌సిటీ, తెలంగాణ ఎక్స్‌ప్రెస్ తదితర రైళ్లు సికింద్రాబాద్‌కు వెళ్లడంతో పాటు అటు నుంచి కాగజ్‌నగర్‌కు వచ్చే రైళ్లలో విపరీతమైన ట్రాఫిక్ ఉంటుంది. దీంతో ఉదయం 5 గంటల నుంచి 11 గంటల వరకు ఎప్పుడు చూసినా బ్రిడ్జి కిందున్న రైల్వే గేట్ మూసే కనిపిస్తుంటుంది. ఈ సమయంలో అత్యవసర పనులపై వెళ్లే వారు నానా అవస్థలు పడాల్సి వస్తుంది. ఒకేసారి నాలుగైదు రైళ్లు క్రాసింగ్ ఉంటే రెండు నుంచి మూడు గంటలు వెయిట్ చేయాల్సిన దుస్థితి. కిలోమీటర్ల కొద్ది ట్రాఫిక్ జామ్ అవుతుంది. అలాగే సాయంత్రం పనులు ముగించుకొని తిరిగి వచ్చే క్రమంలోనూ రైళ్ల తాకిడి ఎక్కువగా ఉండడతో ఎదురుచూపులు తప్పడం లేదని వాహనదారులు వాపోతున్నారు. ఈ మార్గంలో రావాలంటేనే భయమేస్తుందని చెబుతున్నారు. ఇప్పటికైనా రైల్వే శాఖ సీరియస్‌గా తీసుకొని ఆర్వోబీ నిర్మాణాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

### 40 మీటర్ల స్లాబ్ వేస్తే పూర్తవుతది

*రాష్ట్ర ప్రభుత్వం తరపున చేయాల్సిన పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. రైల్వే ట్రాక్‌పై నుంచి 40 మీటర్ల స్లాబ్ వేస్తే దాదాపు కిలోమీటర్ కొద్ది ఉన్న ఆర్వోబీ మొత్తం అయిపోయినట్లే. కానీ రైల్వే అధికారుల నుంచి స్పందన రావడం లేదు. తరచూ అధికారులు మారుతుండడంతో ఫాలోఅప్ చేయడం ఇబ్బందిగా ఉంది. మెటలింగ్ చేసి, బీటీ వేస్తే ఆర్ అండ్ బీ పనులు అయిపోతాయి. కానీ రైల్వే వాళ్లు స్లాబ్ వేస్తేనే ఈ పనులు చేయగలం. ఇప్పటికైనా రైల్వే శాఖ స్పందించి ఆర్వోబీ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేస్తే బాగుంటుంది.*

**- రాధాకృష్ణ, ఆర్అండ్‌బీ, డీఈ**

### గేటు వేసినప్పడల్లా ట్రాఫిక్ జామ్ అవుతుంది



*సిర్పూర్(టీ), మార్చి 14 : వేంపల్లి గ్రామ సమీపంలోని రైల్వే గేటుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రతి రోజూ ఈ రూట్లో మస్తు రైళ్లు వెళ్తుంటాయి. ఈ మార్గం మీదుగా సిర్పూర్(టీ), కౌటాల, చింతలమానేపల్లి, బెజ్జూర్ మండలాలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రైల్వే గేటు మూసినప్పుడల్లా దాదాపు కిలో మీటర్ వరకు ట్రాఫిక్ జామ్ అవుతుంది. అరగంట దాకా అక్కడే వేచి చుడాల్సి వస్తుంది. ఇకనైనా అధికారులు స్పందించి వేంపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జిని త్వరగా పూర్తి చేయాలి.*

**- నులిగొండ రాజశేఖర్, ఆటో డ్రైవర్, సిర్పూర్(టీ)**

## అంతర్రాష్ట్ర ఎక్సైజ్ అధికారుల భేటీ


మాట్లాడుతున్న అంతర్రాష్ట్ర ఎక్సైజ్ అధికారులు

ఎదులాపురం, మార్చి 14 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు జిల్లాల ఎక్సైజ్ అధికారులు సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు రాష్ట్రాల మధ్య దేశీదారు, మద్యం, నాటు సారా, గంజాయి రవాణా విక్రయాలను అరికట్టేందు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టుల ఏర్పాటు, నేరస్తుల సమాచారం ఇచ్చిపుచ్చుకోవాలని పేర్కొన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, కలిసి దాడులు నిర్వహించాలన్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ హిమశ్రీ, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లా డీపీఈవోలు నందగోపాల్, జ్యోతికిరణ్, చంద్రపూర్ జిల్లా ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.


దుర్గం చిన్నయ్య నివాసంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్


నెన్నెలలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

# పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తాచాటాలి

**అంకితభావంతో పనిచేస్తే గెలుపు మనదే**

- కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలి
- ప్రజలందరికీ అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తా
- బీఆర్ఎస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్
- పలుచోట్ల మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యతో కలిసి సన్నాహక సమావేశాలు

బెల్లంపల్లి రూరల్/బెల్లంపల్లి టౌన్, మార్చి 14 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలని, నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో పనిచేస్తే గెలుపు మనదేనని బీఆర్ఎస్ పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. గురువారం కన్నాలలోని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య నివాసంలో ఏర్పాట్లు చేసిన కార్యకర్తల సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సింగరేణి ప్రాంతమైన గోదావరిఖనిలో జన్మించి, అక్కడే చదువు పూర్తి చేసి 26 ఏళ్లు సింగరేణిలో ఉద్యోగం చేశానని గుర్తు చేశారు. ప్రజల మద్దతుతో ధర్మపురి నియోజకవర్గంలో పోటీ చేసి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందానని తెలిపారు. మొదటి నుంచి ఉద్యమ స్ఫూర్తితోనే పని చేశానే తప్ప.. ఏనాడూ పదవులకు ఆశపడలేదని చెప్పారు. ఈసారి పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచి మార్పు తీసుకువస్తానని, ప్రజలందరికీ అందుబాటులో ఉంటానని, ప్రజలు ఎప్పుడు ఫోన్ చేసినా స్పందిస్తానన్నారు. ఎంపీ వెంకటేశ్‌నేతకాని చెప్పకుండా బీఆర్ఎస్ పార్టీని వీడాడని, అధినేత కేసీఆర్ ఆదేశాన్ని శిరోధార్యంగా భావించి పోటీలో నిలిచానన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఉన్నంత కాలం అందులోనే కొనసాగుతానని చెప్పారు. బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సూచనల మేరకు నాయకులు,కార్యకర్తలు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, కరెంటు కోతలతో వ్యవసాయం కష్టంగా మారిందని, ఆ పార్టీ వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, జడ్పీ వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణ, బెల్లంపల్లి ఎంపీపీ గొమాస శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, మాజీ ఎంపీపీ పొట్లపల్లి సుభాష్‌రావ్‌తో పాటు నియోజకవర్గంలోని పార్టీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు , విద్యార్థి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రంలో అరాచక పాలన..

కాసిపేట, మార్చి 14 : ప్రస్తుతం రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తుందని, కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజలకు వివరించి చైతన్యవంతులను చేయాలని మాజీ మంత్రి, పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ పిలుపు నిచ్చారు. గురువారం కాసిపేట మండల కేంద్రంలోని ముత్యంపల్లిలో నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యతో కలిసి హాజరై మాట్లాడారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని కోరారు. కేసీఆర్‌ను, బంగారంలాంటి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని పోగట్టుకున్నామని ప్రజలు బాధపడుతున్నారన్నారు.

### గెలుపే లక్ష్యంగా పనిచేయాలి :

**మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య**

ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య పిలుపునిచ్చారు. మన ప్రభుత్వంలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించాలన్నారు. జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి, సహకార చైర్మన్ నీలా రాంచందర్, ఎంటీసీలు కొండబత్తుల రాంచందర్, అక్కెపల్లి లక్ష్మి, చంద్రమౌళి, నాయకులు ఏనుగు తిరుపతిరెడ్డి, మడావి అనంతరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏనుగు మంజులారెడ్డి, కార్యదర్శి మోటూరి వేణు, బోయిని తిరుపతి, అగ్గి సత్తయ్య, అట్టెపల్లి శ్రీనివాస్, పిట్టల సుమన్, చింతల భీమయ్య, రాంటెంకి వాస్‌దేవ్, జాడి రాంచందర్, జంగు, అజ్మీర తిరుపతి, హన్మంతు, ఆడె శంకర్, దుర్గం సాగర్ పాల్గొన్నారు.

### కాంగ్రెస్ మోసాలను ప్రజలకు వివరించాలి

తాండూర్, మార్చి 14 : తెలంగాణ రాష్ట్రం కోసం రాజీనామాలో ముందు వరుసలో ఉన్నానని మాజీ మంత్రి, పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ గుర్తు చేశారు. గురువారం రేచినిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, సింగిల్ విండో చైర్మన్ సుబ్బ దత్తుమూర్తి నివాసంలో మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య ఆధ్వర్యంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ తెలంగాణ కోసమే పుట్టిన ఉద్యమ పార్టీని ప్రజలు గెలిపించుకుంటారని, ఇక్కడి ప్రజల తరపున పార్లమెంటులో గళం వినిపించాలంటే బీఆర్ఎస్ అభ్యర్థినే గెలిపించాలని కోరారు. కార్యకర్తలు, నాయకులు కష్టపడి పనిచేయాలని, కాంగ్రెస్ పార్టీ మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. అన్ని మతాల విశ్వాసాలను, మనోభావాలను కేసీఆర్ ప్రభుత్వం కాపాడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పూసాల ప్రణయ్‌కుమార్, వైస్ ఎంపీపీ దాగం నారాయణ, రైతు సమన్యాయ సమితి అధ్యక్షుడు దత్తాత్రేయరావు, మాజీ సింగల్ విండో చైర్మన్ చంద్రశేఖర్, సీనియర్ నాయకులు పురుషోత్తం గౌడ్, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

### నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటా

నెన్నెల మార్చి 14 : కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో వైఫల్యం చెందిందని, ప్రజలకు వాస్తవాలను వివరించాలని మాజీ మంత్రికొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. గురువారం గుండ్లసోమారంలో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికలు మనకెంతో ప్రతిష్టాత్మకమని, ఈ ఎన్నికల్లో గెలవాల్సిన అవసరముందన్నారు. ప్రజలందరికీ అందుబాటులో ఉంటానని తెలిపారు. నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధికంగా బీఆర్ఎస్ సీట్లు గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మండల అధ్యక్షుడు పంజాల సాగర్‌గౌడ్, ఎంపీపీ రమాదేవి, జడ్పీటీసీ శ్యామల, నాయకులు రాంచందర్, ప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థిగా ఆత్రం సక్కు

**ఖరారు చేసిన అధినేత కేసీఆర్**


ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

కుమ్రం భీం ఆసిఫాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు పేరును ఆ పార్టీ అధినేత కేసీఆర్ ఖరారు చేశారు. గురువారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థిగా ఆత్రం సక్కును ఆయన ప్రకటించారు. తిర్యాణి మండలం గిన్నెధరి గ్రామ పరిధిలోగల లక్ష్మీపూర్‌కు చెందిన ఆత్రం సక్కు 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి మొదటిసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014లో కాంగ్రెస్ నుంచి పోటీచేసి బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి చేతిలో ఓడిపోయారు. 2018లో కాంగ్రెస్ నుంచి పోటీచేసి ఎమ్మెల్యేగా రెండోసారి ఎన్నికయ్యారు. ఆ తర్వాత బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆదిలాబాద్ ఎంపీగా అవకాశం కల్పిస్తామని కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయలేదు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోకి వచ్చే ఏడు నియోజకవర్గాల్లో ఆదివాసీ సామాజిక వర్గానికి చెందిన ఓట్లు అధికంగా ఉండడం, ఇప్పటికి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలువడం.. గిరిజనుల్లో మంచి పేరు ఉండడంతో అధిష్టానం ఆత్రం సక్కు పేరును ఖరారు చేసినట్లు తెలిసింది.


వెంచర్‌లోని హద్దురాళ్లను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

## అక్రమ వెంచర్లలోని హద్దురాళ్ల తొలగింపు

మంచిర్యాలటౌన్, మార్చి 14 : మంచిర్యాల పట్టణంలోని రాజీవ్‌నగర్ ఏరియాలో 345 సర్వేనంబర్‌లో అక్రమంగా వెలిసిన వెంచర్లలోని హద్దురాళ్లను గురువారం మున్సిపల్ సిబ్బంది తొలగించారు. లేఅవుట్ లేకుండా ప్లాట్లుగా మార్చి అమ్ముతున్నారని అందిన సమాచారం మేరకు నాలుగు చోట్ల చేసిన వెంచర్లలోని హద్దురాళ్లను తొలగించామని, మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టామని టీపీఎస్ సతీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది సతీష్, సత్యం పాల్గొన్నారు.

# బైబై.. వెళ్లొస్తాం

- ముగిసిన ఇంటర్ సెకండియర్ పరీక్షలు
- ఇంటిబాట పట్టిన విద్యార్థులు


మంచిర్యాల అర్బన్, మార్చి 14 : ఇంటర్మీడియట్ పరీక్షలు గురువారంతో ముగియగా, విద్యార్థులు ఇంటిబాట పట్టారు. ఒకరికొకరు టాటా.. బైబై చెప్పుకుంటూ కేరింతలు కొడుతూ ముందుకు కదిలారు. ఆయా కళాశాలల నుంచి లగేజీలతో బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లకు చేరగా, కిటకిటలాడాయి. జిల్లాలోని 25 పరీక్షా కేంద్రాల్లో ప్రశాంతంగా పరీక్షలు పూర్తయ్యాయి. 6,351 (జనరల్ 5,500, వొకేషనల్ 851) మంది విద్యార్థులకుగాను 6,083 (జనరల్ 5,266, వొకేషనల్ 817) మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. 268 (జనరల్ 234, వొకేషనల్ 34) మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇంటర్ పరీక్షా కేంద్రాలను డీఐఈవో శైలజ తిరిగి పరిశీలించారు.

ఆసిఫాబాద్ టౌన్,మార్చి14 : జిల్లాలోని 19 కేంద్రాల్లో 4,570 మంది పరీక్ష రాయాల్సి ఉండగా, 4,416 మంది హాజరయ్యారు. ఇందులో జనరల్ విద్యార్థులు 4,022 మంది ఉండగా, 3,900 మంది హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సులో 548 మందికి, 516 మంది హాజరయ్యారు. ఎక్కడా మాస్ కాపీయింగ్ కేసులు నమోదు కాలేదు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించడానికి కృషి చేసిన సిబ్బందిని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నైతం శంకర్ అభినందించారు. శుక్ర, శనివారాల్లో ఒకేషనల్ విద్యార్థులకు బ్రిడ్జి కోర్స్ పరీక్ష జరుగుతుందని తెలిపారు.



మంచిర్యాలలో పరీక్షా కేంద్రం వద్ద కేరింతలు కొడుతున్న విద్యార్థులు

# ఇక 12 గంటలు ఓపెన్

- బెల్లంపల్లి గ్రంథాలయం ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల దాకా తెరిచి ఉంచాలని ఆదేశాలు
- 'గప్పుడెంట్లుండే.. గిప్పుడెట్లయ్యింది' కథనానికి స్పందన
- ఉచిత భోజనం, స్టడీ మెటీరియల్ అందించేందుకు ముందుకొచ్చిన ఎన్ఆర్ఐ
- 'నమస్తే'కు కృతజ్ఞతలు తెలిపిన అభ్యర్థులు


పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు

బెల్లంపల్లి, మార్చి 14 : బెల్లంపల్లి శాఖ గ్రంథాలయం ఇక నుంచి ప్రతి రోజూ పన్నెండు గంటలు పని చేయనున్నది. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు తెరచి ఉండనున్నది. బెల్లంపల్లి శాఖ కాళోజీ గ్రంథాలయంలో నెలకొన్న సమస్యలపై గురువారం 'నమస్తే తెలంగాణ'లో 'గప్పుడెంట్లుండే.. గిప్పుడెట్లయ్యింది' పేరిట కథనం ప్రచురితం కాగా, సంబంధిత అధికారులు స్పందించారు. 12 గంటలు గ్రంథాలయం తెరిచి ఉంచి, పుస్తకాలు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని గ్రంథాలయాధికారి ఉప్పు గోపిని ఆదేశించారు. గురువారం నుంచే పని వేళలు అమలు చేస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్వీపర్ నీలి రమేశ్, ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు గ్రంథాలయాధికారి ఉప్పు గోపి, మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అటెండర్ ఇరుగురాల శ్రీనివాస్ విధులు నిర్వర్తించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఇక నుంచి ప్రతి శుక్రవారం, రెండో శనివారం కూడా గ్రంథాలయం కొనసాగనున్నది. గ్రంథాలయంలో నెలకొన్న సమస్యలను అధికారులు, దాతల దృష్టికి తీసుకొచ్చి పరిష్కారానికి కృషి చేసిన 'నమస్తే తెలంగాణ'కు అభ్యర్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



గ్రంథాలయంలో అంటించిన వాల్‌పేపర్

### ముందుకొచ్చిన ఎన్ఆర్ఐ తోడే వెంకటకృష్ణారెడ్డి

'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ప్రచురితమైన కథనంపై ఎన్ఆర్ఐ బూడిద గడ్డ బస్తీకి చెందిన తోడే వెంకట కృష్ణారెడ్డి స్పందించారు. శని, ఆదివారాలు 70 మంది పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉచిత భోజన సౌకర్యం కల్పిస్తానని తెలిపారు. దాతలు ముందుకు రాని పక్షంలో మిగతా ఐదు రోజులు కూడా భోజనం పెడతానని చెప్పారు. మాజీ కౌన్సిలర్ తోడే వంశీ కృష్ణారెడ్డి స్మారకార్థం స్టడీ మెటీరియల్‌ను అందిస్తామని తెలిపారు. రెండేళ్ల కితం తోడే వంశీ కృష్ణారెడ్డి రూ.60 వేల విలువైన పుస్తకాలను గ్రంథాలయానికి అందించారు. ఏ సమస్య ఉన్నా చేయూతనందిస్తానని స్పష్టం చేశారు.

## శ్రీరంగం వెంచర్ ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయవద్దు

**సబ్ రిజిస్ట్రారుకు లేఖ రాసిన మున్సిపల్ అధికారులు**


అక్రమాల శ్రీరంగం

గత నెల 24న 'నమస్తే' కథనం

మంచిర్యాలటౌన్, మార్చి 14 : మంచిర్యాల పట్టణంలోని రంగంపేట శివారులో వెలిసిన 'శ్రీరంగం హిల్ సిటీ' లోని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయవద్దని మున్సిపల్ అధికారులు సబ్‌రిజిస్ట్రారుకు గురువారం లేఖ రాశారు. కమిషనర్ మారుతీప్రసాద్ ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ సతీశ్ ఇందుకు సంబంధించిన లేఖను స్వయంగా రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లి అందజేశారు. గత నెల 23న 'నమస్తే తెలంగాణ'లో 'అక్రమాల శ్రీరంగం' పేరిట కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన మున్సిపల్ అధికారులు రంగంపేటలోని మంచిర్యాల శివారు 58, 68, 69 సర్వే నంబర్లలోని ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేయవద్దని పేర్కొన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా వెంచర్‌ను ఏర్పాటుచేశారని, ఇందుకు సంబంధించిన వార్తా కథనాలు పత్రికలో వచ్చాయని, లేఅవుట్ అనుమతులు లేకుండా చేసిన ఈ ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేయవద్దని కోరారు.